సాక్షి
శ్రీకాకుళం

సోమవారం । 2 । జూన్ । 2025



వెన్నుపోటు బాబు నైజం

వెన్నుపోటు చంద్రబాబు నైజమని కుంభా రవిబాబు దుమ్మెత్తిపోశారు. టెక్కలిలో ఆయన మాట్లాడారు. - 8లో



సైబర్‌కు సిబ్బంది కొరత

సైబర్ విభాగాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. స్టేషన్ ఏర్పాటు కూడా హామీలకే పరిమితమైంది. - 8లో

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక సోమవారం జిల్లా పరిషత్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. అర్జీదారులు వారి అర్జీలను మీకోసం డాట్ ఏపీ డాట్ జీవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఉసూరుమన్నారు..



ఆటోలో వెనుదిరుగుతున్న బావాజీపేట రేషన్ లబ్ధిదారులు

జలుమూరు: మండల పరిధిలో సుమారు 53 రేషన్ డిపోలు ఉండగా 102 గ్రామాల లబ్ధిదారులు సుమారు 18,065 మంది రేషన్ తీసుకోవాలి. చాలా గ్రామాల్లో తొలి రోజు సర్వర్ పనిచేయలేదు. హుస్సేనుపురం పంచాయతీ పరిధి బావాజీపేట లబ్ధిదారులు తమ్మయ్యపేట వచ్చి రేషన్ తీసుకోవాలి. ఆదివారం మొదటి రోజు సుమారు 30 మంది వరకూ ఆటోల్లో తమ్మయ్యపేట వెళ్లారు. అక్కడ సర్వర్ పనిచేయకపోవడంతో గంటలు తరబడి ఎండలో ఉండి వెనక్కి వెళ్లిపోయారు.

పోలీస్ పహారా నడుమ నంబాల పెద్దకర్మ

టెక్కలి: కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామంలో పోలీస్ పహారా నడుమ మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు పెద్దకర్మ కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన బంధువులను పోలీసులు తనిఖీలు చేస్తూ గ్రామం లోపలకు అనుమతినిచ్చారు. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గ్రామం వద్ద ప్రత్యేక పహారా నిర్వహించారు. నంబాల కుటుంబ సభ్యులు హిందూ సంప్రదాయం ప్రకారం పెద్దకర్మను నిర్వహించారు.

బస్సులో 10 కేజీల గంజాయి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: పాతపట్నం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి ఓ ఆర్టీసీ(ఒడిశా) బస్సులో చెక్‌పోస్ట్ సిబ్బందికి సుమారు 10 కిలోల గంజాయి దొరికింది. ఒడిశాలోని భవానీపట్నం నుంచి విశాఖపట్నం వెళుతున్న ఓ ఆర్టీసీ బస్సులో శనివారం అర్ధరాత్రి పాతపట్నం చెక్‌పోస్ట్ వద్ద సిబ్బంది తనిఖీ చేయగా బస్సు వెనుక సీట్‌లో ఉన్న బ్యాగులో సుమారు 10 కిలోల గంజాయి దొరికింది. అయితే ఆ సీటులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో బస్సును దాదాపు మూడు గంటల పాటు నిలిపివేశారు. గంజాయి బ్యాగు తమది కాదని ప్రయాణికులు చెప్పడంతో గంజాయిని స్వాధీనం చేసుకుని బస్సును విడిచిపెట్టారు.

ఆపరేషన్ సిందూర్ వీరులకు సత్కారం



కవిటిలో వీరులకు సత్కారం

కవిటి: ఆపరేషన్ సిందూర్‌లో ధైర్య సాహసాలతో పోరాడిన ఇద్దరు సైనికులను స్థానికులు ఆదివారం సత్కరించారు.ఇండియన్ ఆర్మీలో పనిచేస్తున్న పొల్లాయి మోరేసు విజయ్, పులకల రమేష్ అనే ఇద్దరు ప్రాణాలకు తెగించి పోరాడారని అగ్నికుల క్షత్రియసంఘం నాయుడు పొల్లాయి లక్ష్మణమూర్తి అన్నారు. ఈ సందర్భంగా కుల సంఘం తరఫున సత్కరించారు.

బీచ్ కబడ్డీ పోటీలకు రిఫరీలుగా ముగ్గురు ఎంపిక



శ్రీనివాసరావు



తవిటమ్మ



అప్పన్నమ్మ

శ్రీకాకుళం న్యూకాలనీ: 12వ జాతీయ బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్–2025 పోటీలకు రిఫరీలుగా శ్రీకాకుళం జిల్లా నుంచి ముగ్గురు వ్యాయామ ఉపాధ్యాయులు నియమితులయ్యారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం వేదికగా ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే ఈ పోటీలకు రిఫరీలుగా సాదు శ్రీనివాసరావు (పీడీ, జెడ్పీ హెచ్ స్కూల్ బొంతలకోడూరు), డి.తవిటమ్మ (పీడీ, జెడ్పీహెచ్‌స్కూల్ నిమ్మతొర్లాడ), జి.అప్పన్నమ్మ (పీఈటీ, కేజీబీవీ సింగపురం) నియామకమయ్యారు. వీరి ఎంపిక పట్ల జిల్లా కబడ్డీ సంఘం చైర్మన్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, అధ్యక్షుడు నక్క రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సాదు ముసలినాయుడు, కోశాధికారి నాగళ్ల రమేష్, మెట్ట తిరుపతిరావు, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, ఒలింపిక్, కబడ్డీ సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీకాకుళం మొండేటివీధిలో



రేషన్ బండి సాక్షిగా రేషన్ లబ్ధిదారుల మోత కష్టాలు

ఇచ్ఛాపురం రూరల్



ఈదుపురంలో రేషన్ డిపో వద్ద పడిగాపులు

కోటబొమ్మాళిలో



రాత్రి తొమ్మిది గంటలకు లబ్ధిదారుల పడిగాపులు

శ్రీకాకుళం చినమండల వీధిలో



ఎండలో నించోలేక నీడ వెతుక్కుని కూర్చున్న వృద్ధురాలు

సోంపేట



రేషన్ దుకాణం వద్ద రేషన్ లబ్ధిదారుల నిరీక్షణ

కూటమి పంతం నెగ్గించుకుంది. వైఎస్ జగన్ మార్కు పూర్తిగా చెరిపేసే కుట్రలో భాగంగా జనాలపై కక్ష తీర్చుకుంటోంది. ఎండీయూ వాహనాల ద్వారా ఐదేళ్లు సాఫీగా రేషన్ తీసుకున్న ప్రజలను మళ్లీ డిపోల ముందు నించోబెట్టింది. మరీ ముఖ్యంగా ఓటేసిన పాపానికి గిరిజన ప్రజలను కిలోమీటర్లకు కిలోమీటర్లు నడిపించింది. జిల్లాలో ఆదివారం ప్రారంభమైన రేషన్ పంపిణీ జనాల అవస్థలను కళ్లకు కట్టింది.

లైను కడితేనే రేషను

కొత్తూరు



గొట్టిపల్లి డిపో నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదరాజపురం నడుచుకుంటూ వెళ్తున్న గిరిజనులు

- రేషన్ షాపుల వద్ద క్యూ కట్టిన లబ్ధిదారులు
- ఎండీయూ వాహనాలను పూర్తిగా రద్దు చేసిన ప్రభుత్వం
- గిరిజన ప్రాంతాల్లో నడవలేక అవస్థలు
- మైదాన ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు

మెళియాపుట్టి



పరశురాంపురం నుంచి చందనగిరి గ్రామానికి రేషన్ సరుకులు తీసుకెళ్తున్న గిరిజనులు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

ప్రజలకు రేషన్ కష్టాలు ప్రారంభమయ్యాయి. ఇంటి వద్దనే ప్రశాంతంగా రేషన్ తీసుకునే సదుపాయాన్ని రద్దు చేసి కూటమి ప్రభుత్వం రేషన్ డిపోలను తెరిచింది. దీంతో పనులు మానుకుని డిపోల వద్ద నిరీక్షించే పాత సంప్రదాయానికి మళ్లీ తెర తీసినట్టైంది.

ఆరేళ్ల కిందట ఇలా..

ఆరేళ్ల కిందట నాటి టీడీపీ ప్రభుత్వం హయాంలో డిపోల వద్ద జనాలు రాత్రీపగలు నిరీక్షించేవారు. కొన్ని సందర్భాల్లో రోజంతా కాపు కాసినా సరుకులు దొరికేవి కావు. కూలి పనులు మానుకుని డిపోల వద్ద ఎదురు చూడాల్సి వచ్చేది. వృద్ధులు, దివ్యాంగులు సరుకులు తీసుకోవాలంటే పెద్ద ప్రయాసగా ఉండేది. ఈ పాస్ పేరిట నెట్ అందక తీవ్రంగా ఇబ్బంది పడేవారు. ఇక డీలర్ల చేతివాటానికి వారిపై నమోదైన 6ఏ కేసులే సాక్షి.

వైఎస్సార్‌సీపీ పాలనలో..




రేషన్ బియ్యం కష్టాలను నాటి పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జనాలు వివరించారు. దీంతో డీలర్ల అవినీతికి ఆయన చెక్ పెట్టారు. డిపోల వద్ద నించోవాల్సిన అగత్యం లేకుండా రేషన్ వాహనాల పద్ధతి ప్రవేశపెట్టి ఇంటి వద్దకే సరుకులు అందజేశారు. కచ్చితమైన తూనికలు, పారదర్శకంగా రేషన్ సరుకులు లబ్ధిదారులకు అందేవిధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులతో పాటు జనమంతా సంతోషంగా సరుకులు తీసుకునేవారు. వేల మందికి ఉపాధి కూడా దొరికింది.

వాహనాలు రద్దు చేసి..

కూటమి ప్రభుత్వం వచ్చాక వైఎస్ జగన్ మార్కు ఉన్న ప్రతి వ్యవస్థపై విషం జల్లుతూ వచ్చింది. అందులో భాగంగానే పేదల కోసం ప్రవేశపెట్టిన రేషన్ బండ్ల వ్యవస్థను రద్దు చేసి రేషన్ డీలర్లు చేతికి పంపిణీ పగ్గాలు ఇచ్చారు. నేరుగా డీలర్ వద్దకు వెళ్లి రేషన్ తీసుకోవాలని ఆదేశించారు. దీంతో మళ్లీ రేషన్ కష్టాలు

ఏడాది పాలన
ఇదేనా బాబూ..



ప్రారంభమయ్యాయి. జిల్లాలో 422 రేషన్ వాహనాలను ప్రభుత్వం రద్దు చేసింది. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 383 కాగా, పట్టణ ప్రాంతాల్లో 39 వాహనాలు ఉన్నాయి. వీటిని రద్దు చేయడంతో పాటు ఈ వాహనదారుల ఉపాధిని కూడా దూరం చేసింది.

కంది పప్పునకు ఎగనామం

జిల్లాలో గత ఆరు నెలలుగా కంది పప్పు రేషన్ సరుకుల్లో ఇవ్వడం లేదు. కేవలం బియ్యం, పంచదారను మాత్రమే ఇస్తున్నారు. 2025 జనవరి, ఫిబ్రవరి నెలల్లో చాలా మందికి బియ్యం కూడా ఇవ్వలేదు. డీలర్ల వ్యవస్థ రావడంతో ఇలాంటి అక్రమాలు పెచ్చుమీరుతాయని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త రేషన్ కార్డు అందని ద్రాక్షే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలం నుంచి కొత్తగా ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదు. జిల్లా వ్యాప్తంగా 657 సచివాలయాల పరిధిలో సుమారు 45,990 మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో కొంతమందివి ఆన్‌లైన్ ప్రక్రియ కాగా మరికొందరివి సచివాలయాల్లో సర్వర్ డౌన్‌తో ఆఫ్‌లైన్ దరఖాస్తులు ఉంచారు. ఈ రేషన్ కార్డుల కోసం అటు తహసీల్దార్ కార్యాలయానికి, ఇటు గ్రామ సచివాలయాలకు నిత్యం తిరుగుతూ కాళ్లరిగిపోతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – ఆమదాలవలస

కనీస సౌకర్యాలు కల్పించలేని ప్రభుత్వం ఎందుకు



ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించలేని ప్రభుత్వం ఎందుకు. ఏడాదిగా ఎంతో మంది రేషన్ కార్డు కోసం **ఎదురు చూస్తున్నారు.** కానీ మంజూరు చేయలేదు. దీనికి తోడు రేషన్‌లో బియ్యం, పంచదార తప్ప ఇంకేమీ ఇవ్వడం లేదు. చంద్రబాబు పాలన ఇలాగే ఉంటుంది. – బొడ్డేపల్లి నారాయణరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్



కొత్తూరు: నెట్ అందకపోవడంతో చెట్టు నీడలో ఇలా..

నాలుగు కిలోమీటర్లు నడిచాం



మేం నాలుగైదు కిలోమీటర్లు కొండల మీద నుంచి నడిచి గొట్టిపల్లి రేషన్ డిపోకు వచ్చాం. బియ్యం తీసుకొని తిరిగి స్వగ్రామం పెదరాజపురం వెళ్లడం చాలా కష్టమైంది. బరువు మోసుకుంటూ అంతదూరం వెళ్లలేకపోయాం. ఇంటి దగ్గరకు సరుకులు తీసుకొని వచ్చి ఇవ్వడం వల్ల ఎంతో మేలు జరిగేది. ఇప్పుడు రోజంతా బియ్యం కోసం పనులు మానుకుని ఉండాల్సి వస్తోంది. – సవర గంగమ్మ, పెదరాజపురం గిరిజన గ్రామం

పనులు మానుకున్నాం..



రేషన్ డిపోల వద్ద బియ్యం ఇవ్వడం వల్ల ఒక రోజు పని మానుకుని వెళ్లాల్సి ఉంటుంది. దీని వల్ల కూలి డబ్బులు పోతాయి. గతంలో జగనన్న మాదిరిగా ఇంటికి బియ్యం తీసుకు వస్తే అయితే ఎంతో మంచిది. – ఆరిక కాంతమ్మ, గొట్టిపల్లి, కొత్తూరు మండలం



కొత్తూరు: కొత్తూరు రేషన్ డిపో–11లో బియ్యం కోసం వేచి చూస్తున్న లబ్ధిదారులు

ఆదిత్యా నమోస్తుతే..!



సూర్యనమస్కార పూజలు నిర్వహిస్తున్న పండితులు

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వైశాఖ మాసం నాలుగో ఆదివారం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. అంతరాలయంలో ప్రత్యేకంగా తులసీదళాలతో ఆదిత్యునికి అలంకరణ చేసి ఉదయం 5.30 గంటల నుంచే సర్వదర్శనాలకు అనుమతించారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో దాతలు,ప్రముఖులకు అంతరాలయ దర్శనంతో పాటు సాధారణ భక్తులకు గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినప్పటికీ భక్తులకు అవస్థలు తప్పలేదు. మరుగుదొడ్లు, కేశఖండనశాల వద్ద సిబ్బంది అదనపు వసూళ్లు ఏమాత్రం తగ్గలేదు. ప్రసాదాల కౌంటర్ల వద్ద కూడా భక్తులు అవస్థలు పడ్డారు. వివిధ దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.6,38,100, విరాళాలు, ప్రత్యేక పూజలల ద్వారా రూ.1,05,828, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.05 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈవో ప్రకటించారు.

వీధుల్లో దీపాల వెన్నెల

కంచిలిలో కంచమ్మ తల్లి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వీధులన్నీ ఇలా విద్యుద్దీపాలతో ధగధగ మెరిసిపోయాయి. -కంచిలి



కొత్త బంగారు లోకం..



ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల

- నేడు పునఃప్రారంభం కానున్న జూనియర్ కళాశాలలు
- 2025–26 విద్యా సంవత్సరం నేటి నుంచి మొదలు
- జూన్ 21 వరకు యోగాంధ్రాలో భాగంగా ప్రతిరోజు కాలేజీల్లో యోగాసనాలకు చర్యలు



శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లాలోని జూనియర్ కళాశాలలు సోమవారం నుంచి పూర్తిస్థాయిలో పునఃప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఏప్రిల్ ఒకటి నుంచి సెకెండియర్ విద్యార్థులకు తరగతులు మొదలుపెట్టి, ఏప్రిల్ 7వ తేదీ నుంచి అడ్మిషన్లను ప్రారంభించిన విషయం తెలిసిందే. తాజాగా పూర్తిస్థాయిలో కాలేజీలు తెరుచుకోవడంతోపాటు క్లాసులు మొదలుకానున్నాయి. దీంతో కళాశాలల్లో సందడి వాతావరణం నెలకొననుంది. ప్రైవేటు కాలేజీలు ఇప్పటికే తరగతులను మొదలుపెట్టేశాయి. జిల్లాలో మొత్తం 168 జూనియర్ కళాశాలలు ఉండగా.. ఇందులో 38 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. సెకెండియర్ విద్యార్థులు 20,410 మంది వరకు చదువుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఇప్పటికే అధికారుల ఆదేశానుసారం అడ్మిషన్ డ్రైవ్స్ (క్యాంపెయినింగ్‌లు) నిర్వహించారు.

అడ్మిషన్లు భారీగా పెంచడమే లక్ష్యం



ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో పాఠాలు బోధించడంతోపాటు అన్ని వసతులు, సౌకర్యాలతో విద్య అందిస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, బ్యాగులతోపాటు మధ్యాహ్న భోజనం కూడా అమలవుతోంది. ఈ ఏడాది అడ్మిషన్లను భారీగా పెంచేందుకు ఇంటర్ విద్య ఉన్నతాధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు.
– రేగ సురేష్ కుమార్, ఇంటర్మీడియెట్ విద్య జిల్లా అధికారి(డీఐఈవో), శ్రీకాకుళం

కాలేజీల్లో యోగాసనాలు..

జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న యోగాంధ్ర–2025లో భాగంగా కాలేజీల్లో విద్యార్థులతో యోగసనాలను వేయించేలా ఇంటర్‌విద్య జిల్లా అధికారులు ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన పలు కాన్ఫరెన్స్ కాల్ మీటింగ్‌లో సూచనలు చేశారు.

235 రోజులు పనిదినాలు..

వార్షిక క్యాలెండర్ ప్రకారం 2025–26 విద్యా సంత్సరానికి సంబంధించి జూనియర్ కళాశాలలు 235 రోజులు పనిచేయనున్నాయి. ఆఖరి పని దినంగా 2026 మార్చి 18గా నిర్ణయించారు. కొత్త విద్యా సంవత్సరంలో 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 18 వరకు మొత్తం 314 రోజులు ఉండగా ఇందులో ఇందులో 235 రోజులు కళాశాలలు పనిచేయనున్నాయి. మరో 79 రోజులు రెండో శనివారం, ఆదివారం, పండగలు, ఇతర సెలవు దినాలు ఉన్నాయి.

ఆఫ్‌షోర్ నిర్వాసితుల బైక్ ర్యాలీ



చీపురుపల్లి గ్రామంలో నిర్వాసితులతో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు గంగారపు సింహాచలం

మెళియాపుట్టి: రేగులపాడు ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయకార్మిక సంఘం ఉపాధ్యక్షుడు గంగారపు సింహాచలం డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో చీపురుపల్లిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాజెక్ట్ కోసం ఇళ్లు, భూములు, గ్రామాన్ని సైతం త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. చీపురుపల్లి గ్రామ పురవీధుల్లో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించి సమస్యలపై నినాదాలు చేశారు. పునరావాస కాలనీల్లో ఇప్పటికీ రహదారులు, వీధి దీపాలు, మౌలిక సదుపాయాలు లేవన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యవ్వారి ఈశ్వరరావు,దొర విజయ్ కుమార్, కిరణ్,మాధవరావు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల 'వంటా-వార్పు'



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఇంజినీరింగ్ వర్కర్లు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, కనీస పెన్షన్ రూ.పది వేలు ఇవ్వాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల గౌరవ అధ్యక్షులు తిరుపతిరావు, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, వై.శ్యామలరావు, ఆర్.సతీష్ డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ కార్మికుల 18వ రోజులుగా చేపడుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్చలకు పిలవాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు, వర్క్ ఇన్‌స్పెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్లు, డీపీఓ, సెక్యూరిటీ గార్డ్స్, పార్క్ వర్కర్స్, గ్యాంగ్ మజ్దూర్, వాటర్ వర్క్స్ వర్కర్స్, ఎలక్ట్రికల్ వర్కర్స్, అటెండర్స్ తదితరులు పాల్గొన్నారు.

అసిరితల్లి సంబరాలకు ముహూర్తం ఖరారు



సిరిమానోత్సవ తేదీలను ప్రకటిస్తున్న ఇప్పిలి శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి-కాజీపేట గ్రామదేవత అసిరితల్లి అమ్మవారి సిరిమానోత్సవ సంబరాలకు ముహూర్తం ఖరారయ్యింది. వచ్చే ఏడాది వైశాఖ శుద్ధ ద్వాదశి ఏప్రిల్ 28న మంగళవారం అమ్మవారి సంబరాల్లో కీలకమైన సిరిమానోత్సవం జరిపేందుకు గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు ఆదివారం అసిరితల్లి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన గ్రామ పెద్దల సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆదిత్యాలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ మాట్లాడుతూ వచ్చే ఏడాది ఘనంగా నెల రోజుల పాటు సంబరాలు, సిరిమానోత్సవం జరుగుతాయని చెప్పారు. అనంతరం పలువురు పెద్దలు మాట్లాడుతూ గతంలో తలెత్తిన లోపాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని, నిర్వహణ కమిటీల్లో యువతరానికి ప్రాధాన్యమివ్వాలని కోరారు. గ్రామ పెద్దల నిర్ణయంపై అరసవల్లి, కాజీపేట, ఆదిత్యనగర్ కాలనీ, కామేశ్వర నగర్, లక్ష్మీనగర్ వాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, శిమ్మ సూర్యనారాయణ, తెలుగు మంగయ్య, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, ఉంగటి రమణమూర్తి, నక్క రామకృష్ణ, నక్క నారాయణమూర్తి, ఉంగటి పాపారావు, తెలుగు సూర్యనారాయణ, సీర చిన్నారావు, కునుకు గోవింద్, రుప్ప అప్పన్న, తెలుగు జగదీష్, దుంగ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దూడకు అరుదైన చికిత్స



దూడకు ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ సుభాష్ చంద్రబోస్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దూసి గ్రామంలో దుప్పల అప్పారావుకు చెందిన లేగదూడ రెండు కాళ్లు వంకరతో పుట్టడంతో డాక్టర్ సుభాష్ చంద్రబోస్ వైద్యం చేసి సాధారణ స్థితికి తీసుకొచ్చారు. శ్రీకాకుళం నగరంలోని పశువైద్యశాలలో ఆదివారం రెండు, మూడు గంటలు పాటు శ్రమించి ఆపరేషన్ చేసి అల్యూమినియం స్ట్రిప్‌తో కట్టు వేసి కాపాడారు. దీంతో రైతు ఆనందం వ్యక్తం చేశారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు స్వస్తి పలకాలి



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న పోలీసు అధికారులు

శ్రీకాకుళం క్రైమ్: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సత్ప్రవర్తనతో మెలగాలని పోలీసు అధికారులు సూచించారు. జిల్లాలో పలు పోలీసుస్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. పోలీసుల ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద రౌడీ షీటర్లను పిలిచి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనవద్దన్నారు. రౌడీషీటర్లపై ఎల్లప్పుడూ పోలీసు నిఘా ఉంటుందన్నారు.

వెన్నుపోటు

చంద్రబాబు నైజం

- కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మొండిచేయి
- ఏడాది దగా పాలనకు గుర్తు వెన్నుపోటు దినం
- పోస్టర్ ఆవిష్కరణలో వైఎస్సార్ సీపీ నేతలు



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు



వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు కుంభా రవిబాబు, ధర్మాన కృష్ణదాస్, పేరాడ తిలక్, జెడ్పీటీసీలు, నాయకులు

టెక్కలి, నందిగాం:

అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ఒక్క హామీ కూడా నెరవేర్చని చంద్రబాబునాయుడుకు వెన్నుపోటు పొడవడం వెన్నతో పెట్టిన విద్య అని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు కుంభా రవిబాబు అన్నారు. ఆదివారం టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో కోటబొమ్మాళి మండల పార్టీ అధ్యక్షుడు సంపతిరావు హేమసుందరరాజు అధ్యక్షతన నియోజకవర్గంలోని నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ కమిటీ సభ్యులతో వెన్నుపోటు దినం సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాసుతో కలిసి హాజరైన రవిబాబు మాట్లాడుతూ చంద్రబాబునా ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ అని, అమలు కాని హామీలు ఇచ్చారని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని గుర్తు చేశారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా హామీలు అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. అయినా మళ్లీ మళ్లీ ప్రజలను మోసం చేస్తునే ఉన్నారని దుయ్యబట్టారు. వివిధ వర్గాల వారికి చేసిన మోసాలను, ప్రజలకు వెన్నుపోటు పొడిచిన వైనాన్ని వివరిస్తూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 4న టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిరక్షరాస్యులకు, రైతులకు, మహిళలకు చేసిన ద్రోహానికి నిరసనగా పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొనావాలని కోరారు. అనంతరం నాయకులంతా కలిసి వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరించారు.

- టెక్కలి జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎప్పుడూ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వస్తుంటారు తప్ప ప్రజలకు మేలు చేసే వ్యక్తి కాదన్నారు. తెలుగుదేశం పార్టీలో ఒక్క ఎన్టీఆర్ మాత్రమే ప్రజల కోసం ఆలోచించేవారని, అలాంటి వ్యక్తికే వెన్నుపోటు పొడిచి కుర్చీ లాక్కున్న చంద్రబాబు ప్రజలకు ఎలా మేలు చేస్తారని ప్రశ్నించారు. ఈసారి కూడా మహిళలకు ఇచ్చిన హామీలు ఒక్కటి అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచారని ధ్వజమెత్తారు.
- సంతబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంత రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు చెప్పిన అబద్ధాలు నమ్మి ప్రజలు ఓట్లు వేశారని, తీరా అధికారంలోకి వచ్చాక ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయకపోవడంతో బాబు నైజం మరోసారి బట్టబయలైందన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారని చెప్పారు. అప్పులు తెచ్చి అమరావతిలో పెట్టి దోచుకుంటున్నారు తప్ప ప్రజల గోడు వినిపించుకోవడం లేదని దుయ్యబట్టారు.
- కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ బతుకుతున్న వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీఏఫ్‌లు, వంట ఏజెన్సీ నిర్వాహకులు, రేషన్ డీలర్లు, రేషన్ పంచే వాహనదారులను అన్యాయంగా తొలగించారని మండిపడ్డారు. ఈ ఏడాదిలో ఏ వర్గానికీ మంచి జరగలేదన్నారు. వంచనతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబుతీరును ఎండగొడుతూ వెన్నుపోటు దినం జరుపుకోవావల్సి బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

వైఫల్యాలను ఎండగడదాం..



ప్రజలను వంచించి, మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ అరాచక పాలన, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు, హామీలు ఎగ్గొట్టిన వైనాన్ని ఎండగడుతూ ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. శ్రీకాకుళం జిల్లా యూనిట్‌గా తీసుకొని ఒకరికి ఒకరు సహకరించుకుంటూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించనున్న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి. ఈ కార్యక్రమంతో ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త కార్యోన్ముఖుడు కావాలి.

– ధర్మాన కృష్ణదాస్,
వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

ఉద్యమాలకు సిద్ధం..



హామీలు నెరవేర్చకుండా ఏడాది పాలన పూర్తి చేసిన కూటమి ప్రభుత్వంపై ఉద్యమాలు చేయాల్సిన సమయం వచ్చింది. అణగారిన వర్గాలకు, వెనుకబడిన కులాలకు దగా చేసిన ఈ ప్రభుత్వానికి మన సత్తా చూపెడదాం. టెక్కలి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నేతృత్వంలో వెన్నుపోటు దినం నిర్వహించి చంద్రబాబు వెన్నులో వణుకు వచ్చేలా చేద్దాం. జూన్ 4న ఉదయం 9 గంటలకు టెక్కలి వైఎస్సార్ విగ్రహం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా కొనసాగుదాం.

– పేరాడ తిలక్,
వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి

టోల్‌గేట్ సమీపంలో ప్రమాదం

- భార్యాభర్తలకు గాయాలు



గాయపడిన సుకన్య

నరసన్నపేట: జాతీయ రహదారిపై మడపాం టోల్ గేట్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. విశాఖ నుంచి స్వగ్రామం టెక్కలి మండలం సింగమహంతిపేటకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా మడపాం టోల్‌గేట్ వద్ద అదుపు తప్పి లారీకి ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బద్దంకి రామారావు, సుకన్యలకు గాయాలయ్యాయి. టోల్‌గేట్ వద్ద ఆగి ఉన్న ఒక లారీ సడన్‌గా పక్కకు రావడంతో గమనించక వీరు లారీని ఢీకొట్టినట్లు తెలిసిందే. స్పందించిన హైవే అంబులెన్స్ సిబ్బంది అంబటి అప్పన్న తదితరులు క్షతగాత్రులను నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పోలవరం ఎత్తు తగ్గింపుతో ఉత్తరాంధ్రకు నష్టం



ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

టెక్కలి/నందిగాం: ఆంధ్రప్రదేశ్‌కు జీవనాధారమైన పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించడంతో ఉత్తరాంధ్రకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు అన్నారు. ఆదివారం వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం సన్నాహక సమావేశంలో వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి రూ.58,312 కోట్లతో 45.72 మీటర్ల ఎత్తుతో, 194.2 టీఎంసీ నీటి సామర్థంతో నిర్మాణం చేయాలని రూపకల్పన చేశారని చెప్పారు. దీని వల్ల ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా ఉత్తరాంధ్రలో 7 లక్షల ఎకరాలకు సాగునీరు, 22 లక్షల పరిధిలో తాగునీరు అందించవచ్చని రూపొందించారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక గత ఏడాది ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించేందుకు నిర్వహించిన సమావేశంలో జిల్లా ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఉండి కూడా అభ్యంతరం చెప్పలేదన్నారు. ఫలితంగా పోలవరం ఎత్తు 41.15 మీటర్లకు తగ్గి 115 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం మాత్రమే కలిగి ఉంటుందని తెలిపారు. ఎత్తు తగ్గడం వల్ల 80 టీఎంసీల నీరు లేకుండా పోవడంతో ఉత్తరాంధ్రకు సాగు, తాగు నీరు వచ్చే అవకాశం ఉండదన్నారు. 20 ఏళ్ల అధికారం అనుభవించిన కింజరాపు కుటుంబం ఈ ప్రాంతానికి చేసిన ఒక్క శాశ్వత నిర్మాణం లేకపోగా ఇప్పుడు రైతాంగానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ ప్రాంతవాసుల కిడ్నీ కష్టాలు తొలగేలా కిడ్నీ ఆసుపత్రి, మంచినీటి సరఫరా, ఉద్యోగ ఉపాధి అవకాశాలు వచ్చేలా మూలపేట పోర్టు మంజూరు చేస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు నత్తనడక నడుస్తున్నాయని మండిపడ్డారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్



రేషన్ సరుకులను దివ్యాంగ లబ్ధిదారునికి అందజేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అరసవల్లి: జిల్లాలో రేషన్ డిపోలను పునఃప్రారంభిస్తున్నామని, ఈ క్రమంలో దివ్యాంగులకు, 65 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటికే వెళ్లి రేషన్ అందజేయనున్నట్లుగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం అరసవల్లిలో డీసీఎంఎస్‌లో రేషన్ డిపోను పునఃప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిత్యావసర సరుకులన్నీ ఇక రేషన్ దుకాణాల నుంచే కార్డుదారులకు సరఫరా చేస్తామన్నారు. జిల్లాలో మొత్తం 6.60 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, మొత్తం 1602 రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెల 1 నుంచి 15వ తేదీలోగా నిత్యావసర వస్తువులు అందజేయనున్నట్లు వివరించారు. జిల్లాలో దివ్యాంగులు, వృద్ధులకు చెందిన కార్డులు సుమారు 67 వేల వరకు ఉన్నాయని, వీరందరికీ రేషన్ డీలర్ల ద్వారానే ఇంటికే రేషన్ వస్తుందని ప్రకటించారు. ఇక అరసవల్లి డీసీఎంఎస్ పరిధిలో 764 కార్డుదారులుండగా, బొంపాడ వీధిలో ఓ దివ్యాంగురాలు, ఒక వృద్ధునికి ఇంటికే వెళ్లి కలెక్టర్ స్వయంగా రేషన్‌ను అందజేశారు. అలాగే రేషన్ ప్రక్రియ కోసం జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని, సమస్యలుంటే ఎవరైనా కంట్రోల్‌రూంను సంప్రదించవచ్చునన్నారు. అలాగే జిల్లాలో ప్రతి రేషన్ డిపో కూడా సమయపాలన పాటించాలని, రోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేయాలన్నారు. ప్రస్తుతానికి బియ్యం, పంచదార మాత్రమే అందజేస్తున్నామని తెలిపారు.

'సైబర్'కు సిబ్బంది కొరత

- ప్రస్తుతమున్న సిబ్బందిపై పని భారం
- మాటలకే పరిమితమైన సైబర్ పోలీస్ స్టేషన్



శ్రీకాకుళం క్రైమ్ : సైబర్ ఫ్రాడ్స్.. ప్రపంచం ప్రజలు ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య.. చిన్నోళ్లని చిదిమేస్తుంది.. పెద్దోళ్లను కబళించేస్తుంది.. తారతమ్యాల్లేవు.. ఎంతటి తెలివైన వారైనా సరే ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా సైబర్ మోసగాళ్ల వలలో పడి ఆర్థికంగా చితికిపోవాల్సిందే. నిన్న మొన్నటి వరకు జిల్లాలో మేజర్ సైబర్ కేసులు (రూ. 5 లక్షల నుంచి రూ. 50 లక్షల్లోపు) అధికంగా నమోదయ్యాయి. ఇటీవల ప్రజల్లో ముఖ్యంగా విద్యార్థులు, యువత, ఉద్యోగస్తుల్లో వీటిపై అవగాహన ఏర్పడటం.. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలోని జిల్లా పోలీసు యంత్రాంగం ఎప్పటికప్పుడు విద్యాసంస్థలు, స్టేషన్ పరిధి ముఖ్య కేంద్రాల్లో అవగాహనా సదస్సులు నిర్వహించడం తదితర కారణాలతో కేసుల సంఖ్య కాస్త తగ్గుముఖం పట్టింది. రూ. 10 వేలు నుంచి రూ. 20 వేలు లోపు చిన్న చిన్న కేసులు నమోదవుతున్నాయి.

అరకొరగా సిబ్బంది..

జిల్లాలోని ఐటీ కోర్ విభాగంలో ఓ ఏఎస్ఐతో కలిపి పది మంది సిబ్బంది ఉన్నారు. వారిలో హెచ్‌సీలు ముగ్గురు, మిగతా వారంతా కానిస్టేబుళ్లే. సైబర్ సెల్ విభాగానికొస్తే ముగ్గురు కానిస్టేబుళ్లు మాత్రమే ఉన్నారు. రెండు విభాగాలకు ఇన్‌చార్జిగా సీఐ శ్రీనివాస్ ఉన్నారు. గతంలో ఇదే సైబర్ సెల్ విభాగానికి సాంకేతికతపై మెండుగా అవగాహన ఉన్న ఐదారుగురికి మించి సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఎన్నికల ఫలితాలొచ్చి కూటమి ప్రభుత్వమేర్పడ్డాక.. అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అనుకూలురుగా వ్యవహరించారని ముద్రపడి వీఆర్‌కు పంపించేశారు. కొంతమంది ఎస్ఐలు, దిగువ స్థాయి సిబ్బంది ఉన్నా వేరే కేసుల్లోనే వినియోగించుకోవడం.. సాంకేతికతపై ఎక్కువశాతం మందికి పట్టు లేకపోవడం ఇబ్బందికి కారణంగా కనిపిస్తోంది.

తగ్గని విధుల ఒత్తిడి..

జిల్లాలో వినూత్నమైన కేసులు ప్రస్తుతం నడుస్తున్నాయి.. నిన్న మొన్నటి వరకు అన్యమత ప్రచారాల కేసు, భారీ చోరీ కేసులు, నకిలీ కరెన్సీ, మిస్సింగ్ వంటి కేసుల్లో టెక్నికల్‌గా ఛేదించే పనిలో పడ్డ సైబర్ నిపుణులు ప్రస్తుతం జిల్లాను పట్టి పీడిస్తున్న బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వంటి జూదాల్లో మునిగి తేలుతున్న ప్రధాన బుకీలు, ఏజెంట్లు, వారి లింకులు టెక్నాలజీ పరంగా కనిపెట్టడంలో బిజీగా ఉన్నారు. ఇంత చేసినా బందోబస్తులకు, విజయవాడ శిక్షణా కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాకో సైబర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. అది మాటలకే పరిమితమైంది. ఒకవేళ వచ్చినా సాంకేతికంగా నిపుణులైన పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటారా లేదా అన్నది వేచి చూడాల్సిందే.

తీరం..పరిశుభ్రం..



శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని పెదగనగళ్లవానిపేట బీచ్‌లో ఆదివారం గ్రీన్ శ్రీకాకుళం వలంటీర్లు పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టారు. ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారాలను తొలగించి దూరంగా పారబోశారు. బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

– శ్రీకాకుళం రూరల్

కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలతో క్రీడాకారులు

రణస్థలం: విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో ఆదివారం జరిగిన 11వ రాష్ట్ర స్థాయి పెన్‌కాట్ సిలాట్ కరాటే పోటీల్లో రణస్థలం శ్రీ పరుశురాం యుద్ధ కళాక్షేత్రానికి చెందిన విద్యార్థులు సత్తాచాటారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి పలువురు పతకాలు సాధించారని ట్రైనర్ లింగాల ఈశ్వరరావు తెలిపారు. విజేతలకు అభినందనలు తెలియజేశారు.

8 నుంచి శంకర విజయంపై ప్రవచనాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 8 నుంచి 12 వరకు మైసూరుకు చెందిన సంతోష్‌కుమార్ ఘనపాటిచే శ్రీశంకర విజయంపై ప్రవచనాలు జరుగుతాయని గుజరాతిపేట రాజరాజేశ్వరీ పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు ప్రవచనాలు ప్రారంభమవుతాయని, అందరూ పాల్గొనాలని కోరారు.

ప్రదర్శన అదరహో..



శ్రీకాకుళం నగరానికి చెందిన శివశ్రీ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకులు డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్య బృందం జపాన్‌లో జరుగుతున్న వరల్డ్ ఎక్స్‌పో-2025లో తమ అద్భుత ప్రదర్శనలతో అలరిస్తున్నారు. ఐదో రోజు పర్యటనలో భాగంగా ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సహకారంతో జరుగుతున్న ఈ పర్యటన బృందంలో రామకౌండిన్య, నేహా, వర్షిత, నేహా థామస్, లలిత, చాందిని ఉన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఆగని అక్రమ నిర్మాణం

- టీడీపీ నాయకులే సూత్రధారులు
- అధికారులు నిలిపి వేయాలని చెప్పినా ఆగని వైనం



ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణం

గార: విలువైన ప్రభుత్వ భూమి. కుటుంబ సభ్యుడు పంచాయతీ మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు కావడంతో భూమిలో అక్రమంగా ఇంటి నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. ఈ విషయమై పత్రికల్లో కథనాలు వచ్చినా.. సోమవారం జరిగే కలెక్టర్ గ్రీవెన్సులో ఆధారాలతో ఫిర్యాదు చేసినా పనులు ఆగలేదు. టీడీపీ నాయకులు కావడంతో అధికారులు కూడా నిర్మాణం వద్దకు వెళ్లడం, ఆపేయమని చెప్పడం తప్పా ముందుకు వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నారని స్థానికులు అంటున్నారు. గార మండలం అంపోలు పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి సమీపంలో జిల్లా జైలుకు వెళ్లే ప్రధాన రోడ్డు ఆనుకొని ఉన్న సర్వే నెంబరు 12లో సుమారు 6 సెంట్లు స్థలం ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం జరుగుతోంది. గత నెల 11న భూమి ఆక్రమణపై సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో 12వ తేదీన ఆర్ఐ రాజేంద్ర, వీఆర్వో మోహన్ వెళ్లి పనులు నిలిపివేయాలని చెప్పారు. అప్పటికి నిర్మాణం పునాదుల స్థాయిలో ఉంది. ఇప్పుడు ఏకంగా గోడలు నిర్మాణాలు జరుగుతున్నాయి. అధికార పార్టీ నాయకుడు కావడంతో అధికారులు అటువైపు చూడటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

ఈ విషయమై అంపోలు-3 వీఆర్వో హర్షకిరణ్ వద్ద ప్రస్తావించగా పనులు నిలిపేయాలని నిర్మాణదారులకు చెప్పామని, తహశీల్దార్‌కు నివేదిక అందజేయగా, నోటీసులు ఇవ్వాలని ఆదేశించారని పేర్కొన్నారు.

రాష్ట్ర బాక్సింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు, కోచ్ ఉమా, సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనే శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. విశాఖపట్నంలోని గాజువాక వేదికగా సోమవారం నుంచి 6వ ఏపీ రాష్ట్ర స్థాయి జూనియర్స్, పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే 11 మంది జిల్లా క్రీడాకారులు ఆదివారం గాజువాక వెళ్లారు. అంతకుముందు వీరికి అధికారులు, బాక్సింగ్ సంఘ ప్రతినిధులు పలు సూచనలు చేశారు. క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తితో ఆడుతూ విజయమే లక్ష్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, శ్రీకాకుళం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బీఏ లక్ష్మణదేవ్, వంగా మహేష్, కోచ్ ఎం.ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ రాజీవ్, సీనియర్ బాక్సర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

కె.యశ్వంత్ (46 కేజీల విభాగం), కె.లక్ష్మీసాయి (48 కేజీల విభాగం), కె.గుణశేఖర్ (50 కేజీల విభాగం), ఎస్.జోషి (52 కేజీల విభాగం), ఎస్.దేవి వరప్రసాద్ (54 కేజీల విభాగం), ఎస్.వినయ్ వరుణ్ (57 కేజీల విభాగం), ఎం.దినేష్ (60 కేజీల విభాగం), ఏ.రామ్‌చరణ్ రెడ్డి (63 కేజీల విభాగం), పి.కృష్ణమోహన్ (66 కేజీల విభాగం), టి.గణేష్ (80 కేజీల విభాగం), జి.సత్య భార్గవ్ (80+ కేజీల విభాగం)